గాలివీడునుంచి న్యూయార్క్‌దాకా

తలవని తలంపుగా గొప్పయోగం ఒకటి వచ్చి వచ్చి తన కాళ్లకు చుట్టుకుంటుందని మల్లారెడ్డి ఏమైనా కలగన్నాడా? మేనల్లుడు మధుసూదనరెడ్డి స్వదేశానికి వచ్చినపుడల్లా పిలిచివెళ్తున్న మాట నిజమే. "నువ్వు బయల్దేరి వచ్చెయ్ మామా! మిగిలిన ఏర్పాట్లన్నీ చేసి పెట్టే పూచీ నాది!" అంటూ బాధ్యత వహిస్తున్నాడు గూడా! అయితే అంగీకారం పొందకనే ప్రయాణానికొక ముహూర్తం నిర్ణయించి, తనకెరుక పరచగలడని మల్లారెడ్డి అనుకోలేదు. విదేశప్రయాణ మంటే ఇష్టంలేక గాదు. వదలని పీడలా ఈ చెంచు రాముడొకడు దాపురించాడే! అదే వచ్చిన ఇబ్బంది!

అట్లాగని మల్లారెడ్డి గురించి తక్కువ అంచనాలు వేసుకోరాదు. పదనువాన పైనబడినా అతడు బెదిరేవాడు గాదు. పిడుగుపాటుకు జడిసేవాడు కాదు. కాకపోతే గడచిన పదేళ్లుగా మిట్టపాళెం చెంచురామానాయుడితో ఏర్పడిన పార్టీ తగాదాల్లో మరొకడూ, మరొకడూ అయితే తట్టుకునేవాడేనా!

ఏ తగాదా అయినా ప్రారంభం కావడం చిన్న కారణంవల్లనే గదా! అది చిలికి చిలికి గాలివానగా మారడానికి అసెంబ్లీ ఎన్నికలు తోడ్పడ్డాయి. ప్రత్యర్థులిద్దరూ రంగంలో దిగారు. గెలవడానికైతే మల్లారెడ్డి గెలిచాడే గానీ, మేఘాల్ని పర్జన్యాస్త్రంతో పటాపంచలు చేసినట్టుగా, అతడి విజయగర్వానికి చెంచురామానాయుడు గండికొట్టేశాడు. ఎన్నికల్లో అవకతవకలకు పూనుకున్నట్టు కోర్టులో నిరూపించి, అర్థాంతరంగా పదవిని వూడగొట్టి పుణ్యం గట్టుకున్నాడు. "ఒరే చెంచు రామా! నీళ్లులేని చెరువులో నీ తల పుర్రెను ఎండిన తాటిబొచ్చెను తన్నినట్టుగా తన్నకపోతే నా పేరు మల్లారెడ్డే కాదు!" అంటూ మల్లారెడ్డి ఘోర శపథం చేశాడు. మొండెంపైన తలకాయతో చెంచు రామానాయుడు సజీవుడై తిరుగుతున్నంత కాలం, ఆ శపథానికి కాలదోషం పట్టిందని చెప్పడానికి వీల్లేదు. అయితే ఈలోగా తాత్కాలికోపశమనంగా నాలుగువందల చెట్టున్న చెంచురామానాయుడి నిమ్మతోటలో ఓరోజు తెల్లవారేసరికి మొదళ్లు మాత్రం మొండిచేతుల్లా కనిపించాయి. చెట్లన్నీ కుప్పకూలిపోయాయి.

"అయిదారువేల వోట్లు రిగ్గింగు చేయించి అప్పట్లో నాకు పదవి రాకుండా చేసినాడు. ఇప్పుడేమో బంగారమటువంటి నిమ్మతోటను పొట్టన పెట్టుకున్నాడు. ఈబోడి మల్లారెడ్డిగాడు కుక్క చావు చచ్చేదాకా నేను నిద్రపోతానా?" అని ప్రతిజ్ఞ చేశాడట చెంచురామానాయుడు. ఆ వర్తమానాన్ని అట్టే ఖాతరు చేసినట్టు లేదు మల్లారెడ్డి. అయినా ఎందుకైనా మంచిదని పొరుగు జిల్లానుంచి నలుగురు కిరాయి గూండాలను దిగుమతి చేసుకుని, వాళ్లను తనకు హోల్‌టైమ్ అంగరక్షకులుగా నియమించుకున్నాడు.

అయిదేళ్ల క్రిందట కొండదొరువులో ఒక పదెకరాల మామిడితోట బేరానికి వచ్చింది. 'మాటా పలుకూ' ఖరారు చేసుకుని నాయుడు రిజిస్ట్రారాఫీసుకు వెళ్ళడానికి సిద్ధంగా వున్నాడు. ఆ దశలో రేటు బాగా పెంచి ఆ తోటను మల్లారెడ్డి గుట్టుచప్పుడుగా

కొట్టేశాడు. ఏం లాభం? వ్రతమైతే దక్కిందిగాని ఫలం దక్కలేదు. ఊరికి దూరంగా వున్న తోట. కాపుదారీ కష్టసాధ్యం. తోపులోనే యిల్లు కట్టించి కావలిగా అందులో ఒక యానాది కుటుంబాన్ని కాపురం పెట్టించాడు మల్లారెడ్డి. ఒక రాత్రివేళ ముసుగు మనుషులు కొందరొచ్చి యానాది సుబ్బయ్యను సున్నంలోకి ఎముకలేకుండా నలగ్గొట్టిపోయారు. ఆ దెబ్బతో రెండు రోజులు గడిచేలోగా యానాది కుటుంబం అయిపు లేకుండా అంతర్ధానమై పోయింది. పేరుకు మాత్రం మామిడితోపు. కొమ్మలుండవు. కాయలుండవు. కలపకు పనికొచ్చే చెట్లుండవు. ఎన్నిసార్లు వేయించినా కంచె వుండదు. మహసూలు కొనడానికి మండీ సాహేబు లెవరూ ముందుకు రారు. తోట సంగతి మనసుకొచ్చినప్పుడల్లా మల్లారెడ్డి జాదు బిగిస్తాడు. పళ్లు గీటిస్తాడు. కళ్ళల్లోనుంచీ చంద్రనిప్పులు రాలుస్తాడు.

ఇప్పుడైనా తన అమెరికా ప్రయాణం గురించి ముందుగా తెలిసివుంటే, కళ్లల్లో నిప్పులు పోసుకునే వాడే చెంచు రామానాయుడు. మరేమీ చేతగాక పోయినా పోలీసులతో లాలూచీపడి 'క్లియరెన్సు సర్టిఫికెట్టు' అయినా చేతికి రాకుండా చూచేవాడు.

అయితే మల్లారెడ్డి తన జాగ్రత్తలో తానుండిపోయాడు. క్లియరెన్సు, పాస్‌పోర్టు సకాలంలోనే సంపాదించాడు. ఎటొచ్చీ వీసా దగ్గరే కొంచెం గొడవ వచ్చేటట్టు తోచింది. ఆంధ్రాకౌంటర్ దగ్గర నిల్చున్న అమెరికన్ ఉద్యోగిని మల్లారెడ్డివైపు ఎగాదిగా చూచింది. జులపాలజుత్తు. బొద్దు మీసాలు, గరుడపక్షి ముక్కు. వీధినాటకంలో రాజవేషంలా సరిగంచు పంచకట్టు. పొడుగాటి పూర్తి చొక్కా, విసనగపు మడువుతో ఇరుభుజాలపైన్నుంచీ పూలదండలా వేలాడుతున్న అంగవస్త్రం. మల్లారెడ్డిది అమెరికా వెళ్లొచ్చే ముఖంలా లేదు. కోడెల బేరంకోసం సంతకు బయల్దేరిన ఖామందులా వున్నాడు.

"ఏం పనిమీద వెళ్తున్నారండీ మా దేశం?" అమెరికన్ మహిళ అచ్చమైన తెలుగులో ప్రశ్నించింది.

"అదేమమ్మా! మా మేనల్లుడు మధుసూదన రెడ్డి వుండడం షికాగోలోనే గదా! పోగా మా వదినగారి కొడుకు జగ్గారెడ్డి డెట్రాయిట్ అనే చోట అవేవో కంప్యూటర్లంటనే, వాటికి మాలీసు చేస్తావుండాడంట! డల్లాసులో మా వూరోడే, మా దాయాదుల కుర్రోడు పట్టుచీరల బిజినెస్‌లో డాలర్లు పండిస్తా వుండాడు. ఆస్టనా, ఊస్టనా అదేందో అందులో..."

"వద్దొద్దు. చాల్లెండి! ఇంతకీ టికెట్టు ఖర్చు వాళ్లే పెట్టుకుంటున్నారా? మీరు కొంటున్నారా?"

ఉలికిపాటువల్ల కలిగిన వుక్రోషంతో మల్లారెడ్డి జేబులో వున్న పాస్‌బుక్కును, పైకి తీసి కౌంటరుపైకి సాచాడు. "ఇది స్టేటు బ్యాంకుది. ఇంకా రెండు బ్యాంకుల్లో ఖాతా వుంది. ఇవిగాక ఫిక్సెడ్ డిపాజిట్లు గూడా..."

"మంచిదండీ రెడ్డిగారూ! మీ అకౌంటు పుస్తకాలు చూడనక్కర్లేదు. మీకు ఆరునెలల గడువుండే వీసా యిస్తున్నాను. నెమ్మదిగా అమెరికా అంతా తిరగొచ్చు. క్షేమంగా వెళ్లి లాభంగా తిరిగిరండి!" అమెరికా ఆవిడ మాటల ధోరణిలో ఇంచుమించు క్షమాపణ ధ్వనించినట్టే వుంది.

"మంచి మాటనినావులే పిండిబొమ్మా! ఆరునెలలదాకా నేనమెరికాలో వుండిపోతే ఇంకేమైనా వుందా? చెంచురాముడి మోచేతులకే మీసాలు పుట్టుకురావా? వాడి కత్తికి

ఎదురుండదు. మావాళ్లకు దిక్కుండదు. కోటను శత్రువుల కప్పజెప్పి దొంగదోవలో పారిపోయి సట్టేగదా!" అనుకున్నాడు మల్లారెడ్డి.

అర్ధరాత్రి ఏ ఒంటిగంటకో మద్రాసు విమానాశ్రయంనుంచి ప్రయాణం ప్రారంభమైంది. పక్కన పక్కా అరవాయన ఎవరో కూర్చున్నాడు. మల్లారెడ్డి నోరు మెదపడానికి వీల్లేకపోయింది. తెల్లవారు జామున ఢిల్లీలో రెండు మూడు గంటల విరామం. ప్రయాణికుల్ని బోయింగ్ విమానంలోకి మార్చారు. ఈసారి పక్కనెవరో ముప్పైయేళ్లకు పైబడని యువకుడొకడు కూచుని వున్నాడు. ఏభాష వాడో తెలియడమెట్లాగ? ఏడో తరగతి దాకా చదువుకున్న తన ఆంగ్ల భాషా పరిజ్ఞానమంతా ఉపయోగించి "విచ్‌ప్లేస్... యూ కమింగ్?" అన్నాడు మల్లారెడ్డి.

అబ్బాయి చిరునవ్వు చిందిస్తూ "నేను తెలుగువాడినేనండీ! చిత్తూరు జిల్లాలో కలకడ దగ్గర మావూరు. ఇంజనీరింగు చదివి ఓ కట్టడాల నిర్మాణం కంపెనీలో పని చేస్తున్నాను. పిట్స్‌బర్గ్ దగ్గర" అన్నాడు

-మంచిది. బాగానే వుంది. అయితే వీడు అస్మదీయుడో, తస్మదీయుడో తెలుసుకోడం ఎట్లా? ఆ విషయం తెలిస్తేనే గదా ఇతడికి ఆకులో పెట్టాల్సిందీ, లేక కంచంలో పెట్టాల్సిందీ తేలేదీ! మీరే కులస్థులబ్బాయీ అంటూ సూటిగా అడగడం ఏం బాగుంటుంది?

ఆ ప్రశ్ననే మరొక విధంగా మార్చుకున్నాడు - "నీ పేరేంది నాయనా?"

"గోపాలకృష్ణమూర్తి అంటార్లెండి! మీరు 'మూర్తీ' అంటే చాలు!"

- ఓరి వీడిల్లు బంగారంగానూ! ఉచ్చులోనుంచీ తప్పించుకున్నాడే - అనుకున్నాడు మల్లారెడ్డి. ఫరవాలేదు. గుంభనంగా మాటలు మొదలు పెడ్తే ఎక్కడో ఒకచోట దొరికిపోకపోతాడా?

"మాదిగూడా దూరాభారమేమీ కాదులే! రాయచోటి దగ్గర గాలివీడే మా వూరు. గిత్తలబేరం కోసరం మీ ఇలాకా అంతా తిరిగినోళ్లమే! కలకడ, గుర్రంకొండ, మహలు అదంతా మాకు కొట్టిన పిండే! ఏం నాయనా, కొండాపురం రెడ్లకు పోతుగుంట నాయుళ్లకు మధ్యన పార్టీలు ఎట్లా వుండాయి?"

"ఆ మాటెందుకులెండి! కొట్టుకు చస్తున్నారు. వాళ్ల పుణ్యమా అని మా పాయకట్టులో ఇరవైముఫ్ఫై వూళ్లవాళ్లకు పగల్లో తిండి సయించదు. రాత్రుల్లో నిద్రపట్టదు. రోడ్డుపైన పోతున్న బస్సును ఆపి, అందులోనుంచి ఒకణ్ణి కిందికి లాగి, నలుగురైదుగురు ఎదురు పార్టీ మనుషులు బాకులతో, బిచువాలతో పొడిచి పారేశారు. నా మొగుణ్ణి చంపినోళ్లు చచ్చేదాకా నేను బొట్టూ దారమూ తీసేది లేదని అతడి భార్య వ్రతం పట్టింది. హంతకులు పరారైపోయారు. వాళ్లు చేతికి చిక్కలేదన్న అక్కస్సుతో వీళ్లు వాళ్ళ కొంపలకు అగ్గిపెట్టేశారు. కసువు వాములు కాల్చేశారు. పొట్టేళ్ళను పట్టుకొచ్చి కోసి తినేశారు. ఇది జరిగిన పది దినాలకు ఆ పార్టీ నాయకుణ్ని మదనపల్లె నాలుగురోడ్ల కూడలిలో నాలుగు వందలమంది చూస్తుండగా నరికి పారేశారు. కాష్ఠం కాలుతూనే వుంది. డబ్బాలకొద్దీ నెయ్యి పోస్తూనే వున్నారు. దీనికి అంతెక్కడండీ బాబూ?"

"అహఁ, అదికాదు. ఎవరిది పైచెయ్యిగా వుందని అడిగినాను..."

అబ్బాయి మరీ పేట్రేగిపోయాడు. "గొంతు కోసుకోడానికి ఏ కత్తి అయితే నేమండీ? అందుకు మీ కత్తి అయితే ఒకటి, నా కత్తి అయితే ఒకటా? నీ కొడుకుల్లో మంచోడెవుడు అని అడిగితే - అదిగో, పూరికొట్టంపైన నిలబడి నిప్పులు రాల్చుతున్న కొరివి త్రిప్పుతున్నాడే, వాడే మంచోడు - అన్నాడట తండ్రి. మీరడిగిన ప్రశ్నకు చెప్పాలంటే నేనూ అట్లాగే సమాధానం చెప్పాలి. అంతెందుకు ఓ మాట చెప్పనా! రెండు వారాల స్వల్పవ్యవధిలో నేనెందుకు వచ్చిపోతున్నానో తెలుసా? తీరని జబ్బుతో మంచాని కంటుకపోయి నన్నే కలవరిస్తున్న మా అమ్మను చూడ్డంకోసం. అంతగా ఆమె కుంగిపోవడానికి కారణం అర్ధాంతరమైన మా తమ్ముడి చావు! వాడికే పార్టీతోనూ ప్రమేయం లేదు. వెనుకనుంచి చూస్తే ఒక పార్టీ లీడరు ముద్దుల కొడుకులా వుండడమే వాడి దోషం. చిన్న రాజాకోసం పొంచివుండిన కిరాయి ఖూనీకోర్లు ఓ చలికాలపు సాయంకాలం మసక చీకట్లో మనిషిని సరిగ్గా పోల్చుకోలేక సొంతపనిపైన కొండాపురం వెళ్లివస్తున్న మా తమ్ముడిపైనపడి సఫాచేసి పారేశారు. శరీరం దొరకలేదు. శరీర భాగాలు మాత్రమే దొరికాయి. మూతి బిగగట్టిన గోతాన్ని చూపించి 'ఇదిగోనమ్మా నీ కొడుకు' అని మా అమ్మకందజేశారు..."

మల్లారెడ్డి మాట్లాడలేకపోయాడు. మాట్లాడినందుకు కించపడిపోయాడు.

"బయల్దేరివస్తుండగా మా అమ్మ ఏమని చెప్పిందో తెలుసాండీ?"

"ఏం చెప్పింది?"

అబ్బాయి కంఠం గాద్గదికమైపోయింది - "నాయనా! నువ్వీదేశానికి రావొద్దురా! లచ్చనంగా ఆ దేశంలోనే వుండిపోరా! వారానికొకసారి ఫోనులో మాటాడరా, చాలు - అందండీ."

వికలమైన మనసును మరమ్మత్తు చేసుకోడానికన్నట్టుగా, మూర్తి సంచిలోనుంచీ ఓ పుస్తకం పైకి తీశాడు. చదువుతున్నంతసేపు చదువుకుని ఆపైన నిద్రలోకి జారుకున్నాడు.

దీపాలు ఆర్పేసి, కిటికీకడ్డంగా తెరలు దించేయడంతో విమాన అంతర్భాగంలోనికి రాత్రివేళ కమ్ముకొచ్చేసినట్టయింది. మల్లారెడ్డిగూడా బయల్దేరిన చోటును, గమ్యాన్ని, బంధుమిత్రుల్ని, శత్రువుల్నీ, కక్షల్ని, కార్పణ్యాల్నీ, పోలీస్‌స్టేషన్లనీ, కోర్టు కేసుల్నీ అన్నింటినీ మరిచిపోయి గాఢనిద్రా వివశుడైపోయాడు.

***

సాయంకాలం నాలుగ్గంటలకెప్పుడో ఫ్లయిట్ లండన్‌లో ఆగింది. విమానాన్ని శుభ్రం చెయ్యడంకోసం, ఇంధనం నింపడంకోసం అవసరమైన రెండు మూడు గంటల వ్యవధిలో ప్రయాణికులు ఏరోడ్రోమ్‌లో ఒకచోట సుఖోపవిష్టులై సేదదీర్చుకున్నారు. మళ్లీ ప్రయాణం కొనసాగింది. ఎంతసేపు గడిచినా పగలే. చీకటి జాడలే లేవు. తేదీగూడా మారదట! తానేదో మాయాలోకంలోకి చొచ్చుకపోతున్నట్టే తోచింది మల్లారెడ్డికి! న్యూయార్కు మహానగరం చేరువకు వస్తున్నకొద్దీ అతడి మనసులో భయం నీడలేవో అలముకోసాయి. దేశంకాని దేశం, ఇంగ్లీషు భాష కొంచెమో నంచమో అర్థమైనా, ఈ తెల్లవాళ్ల యాసలో

అది బోధపడి చావదు. తన అమెరికా యాత్ర సక్రమంగా జరగడమనేది ప్రస్తుతానికి చింతల రవీంద్ర రెడ్డి అనే 'నపురు' (వ్యక్తి)పైన ఆధారపడి వుంది. అతడు విమానాశ్రయంలో తనకోసరం వేచి వుండాలి. ఒకవేళ అనుకున్నట్టుగా అనుకున్న సమయానికి అతడు రాలేకపోతే తనగతేం కావాలి? ఎవర్ని అడగాలి? ఏమని అడగాలి?

చింతల రవీంద్ర రెడ్డి అంటే షికాగోలో వున్న తన మేనల్లుడు మధుసూదనరెడ్డికి ప్రాణస్నేహితుడు. తిరిగి వచ్చేటప్పుడు న్యూయార్కులో ఆగడం కుదరకపోవచ్చును గనుక, సదరు రవీంద్ర రెడ్డి అక్కడి ఏర్‌పోర్టులో తనను కలుసుకుని తన ఇంటికి తీసుకెళ్తాడు. దర్శనీయ స్థలాలనన్నింటినీ దర్శించే ఏర్పాట్లు చేస్తాడు. ఆపైన షికాగో ప్రయాణం. ఇదంతా తన మేనల్లుని ప్లాను. అయితే ఆదిలోనే హంసపాదు అనినట్టుగా ఇందులో ఒక తిరకాసుంది. ఈ రవీంద్రరెడ్డితో తనకిదివరకు ముఖపరిచయమైనా లేదు. ఒకరినొకరు గుర్తుపట్టడమెట్లనో అర్థం కావడం లేదు. కొత్తగడ్డపైన దిగినప్పటినుంచీ సంకటాలేనేమో!

ఈ మూర్తి అనే అబ్బాయి సాయపడతాడమోననుకుంటే అదిగూడా అడియాసే అయిపోయింది. 'పిట్స్‌బర్గ్ ఫ్లయిట్ పట్టుకోడానికి అరగంటకన్నా వ్యవధి వుండదండీ! లగేజీ కలెక్ట్ చేసుకునేదాకా నేను మీకు కంపెనీ యివ్వగలను' అన్నాడు. ఆ తర్వాత నీ పాట్లు నీవేనని గదా అంతరార్థం!

ధగద్ధగాయమానంగా కళ్లకు మిరుమిట్లు గొలిపే దృశ్యం, ఇలాంటిదింకొకటుంటుందా అన్న సందేహానికి ఆస్కారమిస్తూ మనిషిని ఆశ్చర్యంలో ముంచేసే సన్నివేశం, ఆధునిక వాస్తుశాస్త్రం సాధించిన మహాద్భుతం - వెరశీ అదే జాన్‌కెనడీ అంతర్జాతీయ విమానాశ్రయం. అమెరికాదేశపు సంపదకు, వైభవానికీ, ఎంతటి మహత్కార్యాన్ని అయినా సాధించగలవాళ్ల సమర్థతకు అది ప్రతీకగా పొడగట్టింది. అసలే నేల ఈనినట్టుగా క్రిక్కిరిసిపోయి కదులుతున్న జనసందోహం. షాపులకు, హోటళ్లకు, టెలిఫోను బూతులకు, ఇంకా వివిధాగారాలకు చుట్టూ అర్ధచంద్రాకారంతో సాగిపోతున్న నడవదారిలో గోడలకు, నేలకు, పై కప్పుకు తావడం చేసిన పాదర్శకపు ఫలకాలలోనుంచీ సజీవమానవమూర్తుల్లా కదిలి వస్తున్న ప్రతిబింబాలనుకూడా కలుపుకుంటే అదొక జనసముద్రంలాగే కానవచ్చింది. అందులో ఒక బిందువై కలిసిపోయాక, ఇక తన వ్యక్తిత్వానికి లెక్కా, పక్కా ఎక్కడిది? అసలిలాంటి బృహన్నిర్మాణం ఒకటి యిక్కడ కట్టిపెట్టేశారంటే - అందుకు కారణం ఇక్కడి కొచ్చినవాళ్లకందరికీ ఎవరి అల్పత్వం వారికి బాగా తెలిసిరావడం కోసమేనేమో! ఇక్కడ తాను గాలివీడు మల్లారెడ్డి కాడు. అడ్రసులేనివాడు. అనామకుడు.

లగేజీ కలెక్ట్ చేసుకుని మూర్తిగూడా వెళ్లిపోయిన తర్వాత తాను మరింతగా ఒంటరివాడై పోయినట్టు తోచింది. వివిధ దేశాల, వివిధ భాషల, వివిధ వేషాల, వివిధ వయసులవాళ్లతో ఏర్పడిన జనప్రవాహంలో ఈదుకుంటూ, ఎదురీతవల్ల కలిగిన ఆయాసంతో పదిబారలకొకచోట ఆగిపోయి ముందుకు తేరిపార చూస్తూ భారతీయులెవరైనా ఎదురైతే వాళ్ల ముఖంలోకి ఎంతో ఆతురతగా చూపులు సారిస్తూ, ఎట్లాగో ముందుకు కొట్టుకపోతున్న మల్లారెడ్డికి కోరిన కోనలో కురిసిన వానలా, సున్నితమైన పలకరింపు పన్నీటి చిలకరింపులా వినిపించింది.

"ఏమండీ నమస్కారం! మల్లారెడ్డిగారంటే మీరే గదూ! ఏదీ, సూట్‌కేసు యిలా యివ్వండి!"

"ఎట్లా గుర్తుపట్టివి నాయనా?" విస్తుపోతూ అడిగాడు మల్లారెడ్డి.

"మధుసూదన్ రాశాడులెండి! ఆనవాళ్లన్నీ వివరించాడు. అయితే వాటికన్నా చిట్టచివర అతడు రాసినమాట ఒకటి నాకు బాగా ఉపకరించింది. ఏం రాశాడో చెప్పమంటారా? 'మయసభలో రారాజు దుర్యోధనుడిలా జాన్‌కెనెడీ ఏర్‌పోర్టులో ఎవరైనా కనిపిస్తే, ఆయన మా మల్లారెడ్డి మామేననుకో' అన్నాడు."

ఎండిపోయిన పెదవుల్ని నాలుకతో తుడుపుకుంటూ "అట్లనా, అట్లనా" అని విరగబడి నవ్వబోయాడు మల్లారెడ్డి.

***

"మనం ఎట్లా వెళ్లాల? ఇల్లిక్కడికెంత దూరం?" – మెయిన్‌గేటు దాటివచ్చి పేవ్‌మెంటు అంచున నిల్చున్నాక ప్రశ్నించాడు మల్లారెడ్డి.

"ఇంటికెంతో దూరం లేదు. డెబ్భై అయిదు మైళ్లే. ఓ గంటసేపు ప్రయాణం. నా కారుకు కొంచెం రిపేరొచ్చింది. వర్క్‌షాపులో వుంచేశాను. అబ్బాయిని కాన్వెంటునుంచి తీసుకరావడంకోసం నా భార్య రెండో కారు తీసుకెళ్లింది. నేనొక ఫ్రెండును రిక్వెస్టు చేశానులెండి! అతడు తన కారులో నన్ను తీసుకొచ్చాడు. చూచారుగదా, కనుచూపానినంత వరకు కార్లే! తన కారుకు పార్కింగ్ ప్లేసు దొరక్క అతడు రోడ్లపైన తిరుగుతూ వున్నాడు. వస్తాడు లెండి! మనం యిక్కడున్నట్టు పసిగట్టగానే వచ్చేస్తాడు. అందాకా మీరు, అదిగో ఆ కుర్చీలో కూచోండి."

పదినిముషాలలోగా కారొచ్చింది. సామాన్లు డిక్కీలో పడేసి రవీంద్ర అతిథితో పాటుగా వెనుక సీట్లో కూచున్నాడు.

డ్రయివరు సీటులోవున్న అతడి స్నేహితుడు వెనుదిరిగి మల్లారెడ్డి వైపు చూస్తూ అన్నాడు – "నమస్కారాలండీ! ఇందాక రవి మిమ్మల్ని గురించి చెబుతున్నాడు. మీలాంటి పెద్దలు రావడం మాకెంతో ఆనందం. ఎన్నో విశేషాలు తెలుసుకోవచ్చుగదా!"

"ఇంతకూ నా మిత్రుణ్ణి మీకు పరిచయం చేయలేదుగదండీ! అనంతపురం దగ్గర సింగనమల వాళ్లవూరు. పదేళ్లనుంచీ ఇక్కడొక యూనివర్సిటీలో పనిచేస్తున్నాడు. పేరు ఆర్.ఎస్.తుమ్మల. 'మిస్టర్ తుమ్మల' అంటే పలుకుతాడు."

"తుమ్మల! అదేంపేరు?" ఆశ్చర్యం ప్రకటించాడు మల్లారెడ్డి.

"ఇక్కడంతేలెండి! అసలు పేరు తుమ్మల రామచంద్రనాయుడు. అది ఆర్.ఎస్. తుమ్మలగా మారిపోయింది. అట్లాగే నన్నుగూడా చింతల రవీంద్ర రెడ్డి అంటే ఎవరికీ తెలియదు. ఆర్.ఆర్.చింతల అనాలి."

"ఎందుకూ?"

"మేము కులాల్ని రద్దు చేసెయ్యాలనుకుంటున్నాం. అందుకు ప్రాతిపదికగా కులనామాల్ని తుడిచి పారేశాం."

"అట్లా చేసినందువల్ల మీకొరిగేదేముందో?"

"ఏర్‌పోర్టులో చూచారుగదా! తెల్లజాతివాళ్లు, ఆఫ్రికానీగ్రోలు, తూర్పుదేశాల ముస్లిములు, ఆగ్నేయాసియా బౌద్ధులు, భారతీయులు యింకా ఎందరెందరో దేశాల సరిహద్దులు తుడిచేసుకొనివచ్చి ఈ దేశంలో స్థిరపడిపోయారు. సృష్టిలో ఒకదేశం మాత్రం భాగమై, ఇంకొకటి కాకపోతుందా? ఈ వలసలవల్ల అన్ని దేశాలూ మనవేనన్న భావన బలిసింది. ప్రస్తుతానికి మతాలైతే మాసిపోలేదుగానీ, మా బిడ్డపాపలు పెరిగి పెద్దవాళ్లయితే వాళ్ల మధ్య స్నేహాలకు, వివాహాలకు మతాలు అడ్డుగా వుంటాయని మేమనుకోడంలేదు. ఈ భావాల మార్పులో కొండలే బెండ్లుగా ఎగిరిపోతుంటే, ఇక కులాల పట్టింపు ఎక్కడుంటుంది? మనిషి జాతీయ పరిధినుంచి బయటపడి, అంతర్జాతీయ స్థాయిని అందుకుని విశ్వ మానవుడుగా రూపొందాలన్నది మేమాశిస్తున్న మొదటి సోపానం. దేశం, భాష, మతం, కులం లాంటి బాహ్య విషయాలద్వారా మనిషిని గుర్తించడం. కాలదోషానికి గురైపోతున్న న్యాయం, ఔదార్యం, సౌజన్యం, ఉపకారచింతన, ప్రేమ, సహనంలాంటి దివ్యగుణాలే మనిషిని జంతువునుంచీ వేరుచేస్తాయని మేము నమ్ముతున్నాం. మనిషిలో మానవత్వమే ముఖ్యమన్నది మా అభిమతం!"

"ఇదేమన్నా కొత్త మతమా?" ఎద్దేవా చేస్తున్నట్టుగా అడిగాడు మల్లారెడ్డి.

"అబ్బే కాదండీ! ఇది మేము కనిపెట్టిందేమీ కాదు. ఎల్లలోకములొక ఇల్లు కావాలనీ, జాతి భేదాలన్నీ కల్లలు కావాలనీ, జ్ఞానదీపం ఒకటి మాత్రం నిశ్చలంగా నిలిచి వెలగాలనీ తెలుగు మహాకవి గురజాడ అప్పారావుగారు ఈ శతాబ్ది ప్రారంభంలోనే అన్నారు. బహుశా రాబోయే శతాబ్దంలోనైనా ఆయన కల నిజం కావాలని కోరుకోగూడదంటారా?"

మల్లారెడ్డి నిరుత్తరుడై పోయాడు. ఆయనకో విషయం మాత్రం స్పష్టంగా తెలిసిపోయింది. శౌర్యగాథలు, పౌరుషవృత్తాంతాలు వీళ్ల చెవికెక్కేటట్టులేవు. బాంబుప్రేలుళ్లూ, పట్టపగలు ఖూనీలు, రక్తపాతాలు, గృహదహనాలు వీళ్లకు ఉత్తేజం కలిగించేట్టు లేవు. మరైతే వీళ్లు తనద్వారా ఎటువంటి విశేషాలు తెలుసుకోవాలని ఆశిస్తున్నారు?

ఈ ప్రశ్నకు సమాధానం ఆరోజు రాత్రి పడుకోడానికి ముందుగా తెలిసొచ్చింది. రాత్రి భోజనానంతరం భార్యాభర్తలు ప్రశ్నలు గుప్పించారు. భారతదేశంలో నిరక్షరాస్యతా నిర్మూలనం కోసం, వెనకబడిన ప్రాంతాల్లో అభివృద్ధికోసం 'ఎన్నారై'లు నిధులు సమకూర్చి పంపుతున్నారు గదా! ఆ పనులు సవ్యంగా జరుగుతున్నాయా? సత్యసాయిబాబావారి సమాజసేవలు అందవలసిన వారికందరికీ అందుతున్నాయా? బాబాఆమ్టే పేరు విన్నారా? ఆయన నిస్సహాయుల కందిస్తున్న తోడ్పాటును గురించి ఏమైనా చెప్పగలరా? మదర్ థెరెస్సాను మానవరూపంలో వున్న దేవత అన్నారు గదా! ఆమెకా ఘన గౌరవం దక్కడం సముచితమేనంటారా? గాంధీ మహాత్ముని తర్వాత మళ్లీ అంతటి వ్యక్తి ఈనాటి భారతదేశంలో ఎవరైనా వున్నారా?

చిక్కిబిక్కరిస్తూ దిక్కులు చూచాడు మల్లారెడ్డి. అక్షరాలు రానివాడి చేతికి మహాభారతం యిచ్చి చదవమన్నట్టుంది - అతడి పరిస్థితి.

***

న్యూయార్కు నగరంలో వున్న వారం రోజులూ ఏడు క్షణాల్లా గడిచిపోయాయి. రవీంద్ర భార్య మల్లారెడ్డికి 'బాబాయి' హోదా యిచ్చేసింది. ఉదయం తొమ్మిదింటికి

అబ్బాయిని కాన్వెంటులో దిగవిడిచిన తర్వాత ఆమె మల్లారెడ్డినట్లాగే నగర సందర్శనంకోసం తీసుకెళ్లిపోతుంది. ఆకాశ హర్మ్యాలెక్కించింది. భూగర్భ రైళ్ళలో ప్రయాణం చేయించింది. డిపార్ట్‌మెంటల్ స్టోర్సు తిప్పించి ఆయన కవసరమైన వస్తువులు కొనిపెట్టింది. చైనీస్ రెస్టారెంట్లకు, ఇటాలియన్ కఫేలకు తీసుకెళ్లి విదేశీ వంటకాలు రుచిచూపించింది. మధ్యాహ్నాల్లో అచ్చమైన ఇండియన్ హోటళ్లలో అసలైన ఆంధ్రా భోజనం పెట్టించింది. మధ్యాహ్న భోజనానంతరం ఆయన హడ్సన్ నదీ తీరపు పచ్చిక బయళ్లలో సేదతీరుతుండగా ఆమె చేరువగా కూర్చుని అమెరికా కబుర్లెన్నో ఏకరువు పెట్టింది.

మల్లారెడ్డి ఉదయం ఆరింటికి నిద్ర లేస్తాడు. ముఖం కడుక్కుని ఈవలికి వచ్చేసరికి తాగడానికి ఒక లీటరు నీళ్లు సిద్ధంగా వుండాలి. ఆరున్నరకల్లా కాఫీ. పంచదార తక్కువగానే వేయాలి. ఆపైన ఓ గంటసేపు ఉదయకాలపు వాహ్యాళి. తిరిగి వచ్చాక స్నానం. ఉపాహారంలో ఇడ్లీలైతే ఆరు, దోసెలైతే మూడు. సాంబారు, చట్నీ వున్నా, వుండకపోయినా కారప్పొడి తప్పనిసరి. మధ్యాహ్నం టంచనుగా ఒంటిగంటకు భోజనం సిద్ధంగా వుండాలి. కూరగాయల్లో బీర, బెండకాయలంటే చాలా ఇష్టం. కాకరకాయ మాట మాత్రం ఎత్తనేరాదు. కోడి గుడ్లంటే పరమచిరాకు. చికెన్‌బిర్యానీ, మటన్‌కుర్మా ఆయనకు ఫేవరేట్ వంటకాలు. పచ్చిమిరపకాయలంటే ప్రాణం లేచివస్తుంది. ఉప్పుకారం సుష్ఠుగా తగిలించాలి.

శ్రీమతి రవీంద్ర ఒకటి రెండు రోజుల్లోనే మల్లారెడ్డి రుచులు, అభిరుచులు గ్రహించేసింది. అప్పటి నుంచి ఆయన "నాకిది కావాలమ్మా! ఫలానా దినుసు చేయవమ్మా!" అని అడగవలసిన అవసరం లేకపోయింది.

"నాయనా రవీ! నువ్వడిగొచ్చిన వరం గొప్పది. కాకపోతే బంగారంలాంటి అమ్మాయి దొరకడం ఎంత అదృష్టం! ఏ అమ్మ గన్న బిడ్డోగానీ ఇది పరాయిదేశమన్న అభిప్రాయం కలగకుండా నన్నాదరించింది. అమ్మా నీరజా! ఏ కొరతాలేని సంసారం గదమ్మా నీది! ఈ మల్లారెడ్డి నీకేమివ్వగలడు చెప్పు..."

"మీరు మాత్రమే ఇవ్వగలిగినదొకటుంది. ఇప్పుడు కాదులెండి! బయల్దేరడానికి ముందుగా చెబుతాను" - అంది నీరజ.

"వద్దొద్దు. మీరలా అడక్కండి!" - అడ్డుతగులుతూ అన్నాడు రవీంద్ర. "మా నీరజ సంగతి మీకు తెలియదు. ఏదో పెద్ద కొండలకే సన్న చేస్తూ వుంటుంది. ఇప్పుడే చెబుతున్నా మీకు! మళ్లీ నన్ను తప్పుబట్టి లాభం లేదు. నీరజ మీరనుకున్నంత మంచిదేంకాదు. దాపరికం లేకుండా తనను గురించి ఉన్నదున్నట్టుగా చెప్పేయమన్నానా! ఎక్కడ చెప్పింది? మభ్యపెడుతూనే కాలం గడుపుతూ వుంది..."

"అదేమయ్యా రవీ! మాటకూ మాటకూ పొంతన లేకుండా మాట్లాడితే ఎట్లా? ఇంతకూ అమ్మాయిమీద నీ ఆరోపణ ఏంది?"

'ఇందాకా 'ఏ అమ్మ గన్న బిడ్డో' అన్నారు గదా! వాస్తవం తెలిస్తే మీ పాదాల క్రింద నేల కరిగిపోవడం ఖాయం. తల్లి పేరుకేముందిలే! ఎవరైనా పెట్టుకోవచ్చు. తండ్రి పేరు మాత్రం చెప్పి వుండదనే నా నమ్మకం. విన్నారా? ఆయన పేరు కొమ్మినేని శ్రీరాములు చౌదరిగారు. గుంటూరు జిల్లాలో నరసరావుపేట దగ్గర చిన్నవూరు. వీళ్లన్నయ్యా, నేనూ

కాకినాడ ఇంజనీరింగు కాలేజిలో కలిసి చదువుకున్నాం. సెలవుల్లో అప్పుడప్పుడూ వీళ్ల వూరికి వెళ్లొస్తూ వుండేవాణ్ణి. అప్పట్లో ఈవిడ మనసు దోచేసుకుని నన్ను పెళ్లాడేసింది. కానీ విడ్డూరమేమంటే – అంతపని జరిగినా తోకచుక్కలు పొడవలేదు. ఉల్కలు రాల్లేదు. అగ్నివర్షం కురవలేదు. అందువల్ల మా పెళ్లి మూలంగా ధర్మానికేమీ సేగికలగలేదనే అనుకున్నాం..."

"ఏంది నాయనా నువ్వు చెప్పేది. నీరజ నాయుళ్లమ్మాయా?" నిర్ఘాంతపడిపోతూ అడిగాడు మల్లారెడ్డి.

"అంతేనా? ఇంకొక రహస్యం గనక చెప్పేశానంటే మీ పాదాల ముందర బాంబు ప్రేలినట్టే! వీళ్ల చెల్లెలినిచ్చింది మీ జిల్లాలోనే!"

"మా జిల్లాలోనా? ఎక్కడ? ఏవూరు?"

"మిట్టపాళెం చెంచురామానాయుడుగారి చిన్న కోడలు పంకజం స్వయానా వీళ్ల చెల్లెలే!"

మింగుడుపడని వెలగకాయ గొంతుకలో పడ్డట్టయింది. మింగలేక, కక్కలేక మల్లారెడ్డి ఉక్కిరిబిక్కిరి అయిపోతుండగానే నిమిషాలు గంటలుగా మారిపోయాయి.

***

బయల్దేరవలసిన రోజు రానే వచ్చింది. రవీంద్ర అయిదుగంటలకల్లా ఆఫీసునుంచీ వస్తాడు. సాగనంపడంకోసం భార్యాభర్తలిద్దరూ విమానాశ్రయానికి వస్తారు. సాయంకాలం ఏడింటికే షికాగో ఫ్లయిట్.

భోజనం చేసిన తర్వాత కాసేపు కునుకుతీసి లేచాడు మల్లారెడ్డి. తాగడానికి మంచినీళ్లు తెచ్చి యిస్తూ కుర్చీలో కూర్చుంది నీరజ.

"నేనేమడిగినా ఇస్తానన్నారుగదా బాబాయ్! అడగమన్లేదే! నాపైన కోపమొచ్చి నట్టుంది మీకు" – ఆమె మెల్లగా ఉపక్రమించింది.

"అయ్యో అదేం లేదమ్మా! ఇంకా మేమే ఎంతో కాలంనుంచీ మూర్ఖంగా బతుకు సాగిస్తున్నాం. వయసులో చిన్నవాళ్లయినా మీరు చెప్పిన మంచి మాటలు కొన్ని మనసులోనే గట్టిగా నిలిచిపోయినాయి. అమెరికా రాకముందు నాకిద్దరు కూతుళ్లే. ఇప్పుడు ముగ్గురు కూతుళ్లనుకుంటున్నా. నీకేం కావాలో అడుగు. కొండమీది కోతినైనా పట్టుకొచ్చి విమానంలో రవాణా చేయగలను. ఇది నాలుకా, తాటిపట్టా?"

"అబ్బే, అలాంటిదేమీ కాదు బాబాయ్! మీరు నాకో మాట యివ్వాలి..."

"మాటే కదా! దానికేం భాగ్యం? అడుగు."

నేలవైపు చూస్తూ కూచున్న నీరజ గొంతుసవరించుకోబోయింది. అంతలో తటపటాయిస్తూ మౌనం వహించింది.

"ఏమమ్మా, మాటాడవు?"

"చెబుతున్నా బాబాయ్! ఆలోచించే మీరో నిర్ణయానికి వస్తే చాలు. పోరు నష్టమనీ, పొందు లాభమనీ అంటారు. పోరు మానేసి మీరు పొందే కోరుకుంటే బాగుండదూ?"

"అంటే?"

"శత్రువును గెలవడంకన్నా శత్రుత్వాన్ని నిర్మూలించడం గొప్ప విషయమంటారు గూడా! మీరొప్పుకుంటారా బాబాయ్?"

"చెప్పు. వివరంగా చెప్పు."

"ప్రతివారమూ నేను, మా చెల్లెలూ పదిహేను నిమిషాలపాటు ఫోనులో మాట్లాడు కుంటూ వుంటాం. పెళ్లై అత్తారింటికెళ్లాక మా పంకజంలో జీవనోత్సాహమంతా సమసిపోయింది. 'ఏం చెప్పమంటావక్కా! ఏరోజు ఏ దుర్వార్త వినవలసి వస్తుందోనన్న భయంతో సహజీవనం చేస్తున్నాము. యుద్ధగుడారాల నడుమ, ఎదురు కాల్పుల మధ్య దినదినగండంగా బ్రతుకుతున్నట్టుంది. తలకాయలు సొరకాయల్లా తెగిపోవడం, పచ్చినెత్తురుతో భూదేవి చెమ్మగిల్లడం, చచ్చినవాళ్ల భార్యాబిడ్డలు ఆలగోడు, బాలగోడుగా విలపించడం – ఈ కథలు ఎంతకాలమని వినగలం చెప్పు?' అంటూ వాపోతుంది. రాయలసీమలో ఇచ్చేశాము దానికేం బాధలేదు. ఆ ప్రదేశాలన్నా, మనుషులన్నా దానికెంతో ఇష్టం. ఏడాదికంతా పదిపదిహేను పదున్లవాన కురిస్తే చాలునంటుంది. ఆ మాత్రం వానకురిస్తే ఏర్లు సాగుతాయట. చెరువులు నిండిపోతాయట. పంటలకు కొదవేమీ వుండదట. 'ఇద్దరంటే ఇద్దరు మనసు మార్చుకుంటే చాలు, ఈ ప్రాంతం నందనమే! కానీ వాళ్లు మార్చుకోరు. మారరు' అంటూ కుమిలిపోతుంది. ఏం బాబాయ్ మీరు సమ్మతిస్తారా, పాత సంగతులు మరిచిపోయి, కొత్త అధ్యాయం ప్రారంభించడానికి?"

పదిపదిహేను నిమిషాలదాకా ఆలోచిస్తూ వుండిపోయాడు మల్లారెడ్డి. ఆ తర్వాత ఉన్నట్టుండి నిర్ణయానికి చేరువగా వచ్చినట్టుగా "కానీ ఈ ప్రసక్తి అటువైపునుంచీ రావాలగదమ్మా!" అన్నాడు.

"ఆ పూచీనాది, సరేనా బాబాయ్?" ఫోను చేతికి తీసుకుని ఓ పెద్ద సంఖ్యను డయల్ చేసింది నీరజ. "...హలో! నేను మామయ్యా నీరజని... మూడురోజులుగా నేను మీతో జరిపిన తెల్లవారు జాము చర్చలన్నీ ఒక కొలిక్కి వచ్చేశాయి. మల్లారెడ్డి బాబాయి ఇదిగో ఇక్కడే వున్నారు. ఆయనతోనే మాట్లాడాలి మీరు..." రిసీవరును మల్లారెడ్డి చేతికందించింది.

"ఏమయ్యా నాయుడూ!... ఓహో అట్లనా, మంచిది మంచిది. ఒకటేనయ్యా ఆశ్చర్యం. ఒక ఆడకూతురు ఎంతపని చేసిందో చూస్తివా? మనమూ వుండాం. ఎందుకూ? మాటలతో పోయే దానికి ఈటెలు తెచ్చుకున్నాం... అవునవును. మనమూ బాగుండాల. మనచుట్టూ వున్నవాళ్లూ బాగుండాల... ఈ బుద్ధి పదేండ్లనాడే కలిగుంటే, ఎంత నష్టం జరగకుండా పోయేదోగదా! తీరా బాగా చేతులు కాలినతర్వాతగానీ ఆకులు పట్టుకోకపోతిమే! అదేనయ్యా నా బాధ!... సరే, ఇకనేం? నిశ్చింతేగదా! రెండు మూడు నెలలుండే వస్తాన్లే. ఇదిగో అమ్మాయితో మాట్లాడు. చల్లటి మాట నువ్వే చెవిలో వెయ్!"

❖ ఆంధ్రప్రభ వారపత్రిక – 19, జనవరి, 1998. ❖